మూణ్నాలుగు రోజుల్లో బీఆర్ఎస్ కీలక భేటీ

ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులతో కేసీఆర్ సమావేశం

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): మూణ్నాలుగు రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ కీలక సమావేశం జరుగనున్నది. త్వరలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానుండటం, రాష్ట్రంలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకొన్నది. తెలంగాణ భవన్‌లో అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోపాటు పార్టీ ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొనే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా సాగుతున్న పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై కసరత్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. అనుసరించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా సమాలోచనలు చేస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, సహచర ఉద్యమకారులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, లోక్‌సభ మాజీ సభ్యులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ మాజీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులతో పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా సమాలోచనలు చేస్తున్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. వారి నుంచి సూచనల సమహారాన్ని త్వరలో నిర్వహించనున్న సమావేశం ముందు ఉంచి, వాటిపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సమావేశంపై నేడో, రేపో అధికారిక సమాచారం వెలువడే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఒక్క ఉద్యోగమన్నా ఇచ్చారా?

- క్యాబినెట్‌లో ఏ ఒక్క నిర్ణయమూ లేదు
- హామీలు, సమస్యలపై ఏ చర్చాలేదు
- గ్రూప్స్ అభ్యర్థుల డిమాండ్లు పరిష్కరించాలి
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- సీఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): 'గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల ఆందోళన, ఆవేదనను ఈ ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని, క్యాబినెట్ సమావేశంలో వారికి న్యాయంచేసేలా నిర్ణయాలు తీసుకుంటుందని ఎదురుచూశాం. కానీ అందరి ఆశలు అడియాశలు చేసేలా చేశారు' అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గ్రూప్ అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల గురించి ఎలాంటి చర్చ లేకుండా, వారిని నిరాశలోకి నెట్టేసేలా క్యాబినెట్ సమావేశం ముగించి ఉసూరుమనిపించారని ఆరోపించారు. శనివారం నిరుద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, నిరుద్యోగులకు నెలకు రూ.4వేల భృతి ఇస్తామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వివిధ శాఖల్లో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినప్పటికీ, అంతకన్నా ఎక్కువ ఉద్యోగాలు ఇస్తుందని నమ్మి కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటిందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలను ఇచ్చారు తప్ప, కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని వెల్లడించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగ యువత.. ఉద్యోగాల కోసం రోడ్డున పడి అలమటించవలసిన పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. గ్రూప్-1, డీఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక ప్రక్రియ కూడా ఉద్యోగార్థులకు ఇబ్బందికరంగా మారిందని వివరించారు. వారు చేస్తున్న విజ్ఞప్తిని వినే పరిస్థితిలో కూడా ప్రభుత్వం లేకపోవడం శోచనీయమని, బాధ్యతగల ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉద్యోగార్థులకు సంబంధించిన కొన్ని కీలక సమస్యలు, బాధలు, వినతులను మీ (సీఎం) దృష్టికి తెస్తున్నానని తెలిపారు. ఈ అంశాలపై దృష్టి పెట్టి వెంటనే తగు న్యాయం చేయాలని కోరతున్నానని లేఖలో పేర్కొన్నారు.

హరీశ్‌రావు లేఖలో డిమాండ్ చేసిన అంశాలు:

1. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 503 ఉద్యోగాల భర్తీ కోసం గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చాం. వాటికి మరో 60 ఉద్యోగాలు చేర్చి మొత్తం 563 ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ వేశారు. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మెయిన్‌కు 1:50 నిష్పత్తిలో కాకుండా, 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలని కోరుతున్నానను. 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయటం కొత్తేమీ కాదు. గతంలో వైఎస్ఆర్ సీఎంగా ఉన్నపుడు గ్రూప్-1 మెయిన్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేశారు. ఇటీవల ఏపీలో నిర్వహించిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో 1:15 గా పేర్కొన్నా, అభ్యర్థుల కోరిక మేరకు 1:100 నిష్పత్తిలో మెయిన్‌కు ఎంపిక చేశారు. గ్రూప్-1 అనేది యూపీఎస్సీ మాదిరిగా ప్రతి సంవత్సరం ఉండదు. రాష్ట్ర స్థాయి సివిల్స్ పరీక్ష కావటం వల్ల ఆశావహుల సంఖ్య పెరిగింది. 1:100 నిష్పత్తిలో మెయిన్‌కు ఎంపిక చేయటం వల్ల గ్రామీణప్రాంత విద్యార్థులకు గ్రూప్-1 ఉద్యోగాలను సాధించే అవకాశాలు పెరుగుతాయి. దీనివల్ల ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గతంలో కాంగ్రెస్ శాసన సభా పక్ష నాయకుడిగా అసెంబ్లీలో ఇదే డిమాండ్ చేశారు. ఇప్పుడు ఆ వైఖరి నుంచి కాంగ్రెస్ ఎందుకు తప్పుకుంటున్నదో అర్థం కావటం లేదు. గతంలో మీరు చేసిన డిమాండ్‌ను అమలు చేయగలిగే అవకాశం మీకిప్పుడు ఉన్నది కానీ ఎందుకు చేయలేకపోతున్నారు? ప్రతిపక్షంలో ఉంటే ఒక మాట.. అధికారంలో ఉంటే వేరే మాటగా ప్రవర్తించటం ఎందుకు? గతంలో మీరు ప్రకటించిన వైఖరికి కట్టుబడి మెయిన్‌కు 1:100 చొప్పున ఎంపికచేసి ఉద్యోగార్థులకు న్యాయం చేయాలి.
2. గ్రూప్-2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్- 3కి మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపుతామని మాట ఇచ్చారు. ఆ మాటను నిలుపుకోవాలని కోరుతున్నాను.
3. పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండటం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆందోళనకు గురవుతున్నారు. జూలై చివరి వరకు డీఎస్సీ పరీక్షలు ఉన్నాయి, ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష ఉన్నది. ఏడు రోజుల గ్యాప్ మాత్రమే ఉన్నందున అభ్యర్థులు ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని అంటున్నారు. ఈ ఒత్తిడితోనే సంగీత అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకొన్నది. కాబట్టి ఉద్యోగ నియామకాల పరీక్షల తేదీల మధ్య ఎక్కువ వ్యవధి ఉండేలా షెడ్యూల్ సవరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.
4. ప్రభుత్వంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. పత్రికల్లో మొదటి పేజీ ప్రకటనలు కూడా ఇచ్చారు. ఆరు నెలలు దాటినా ఆ దిశగా అడుగులు పడలేదు. వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు గుర్తించి జాబ్ క్యాలెండర్ ప్రకటించి తదనుగుణంగా నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరతున్నాను.
5. మీరు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు మొదటి క్యాబినెట్‌లోనే నిర్ణయం తీసుకుంటామని మీ మ్యానిఫెస్టోలో ఘనంగా ప్రకటించారు. 25 వేల టీచర్ పోస్టులలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. కానీ ఆచరణలో అందుకు భిన్నంగా 11 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి మోసం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిన దానికి కట్టుబడి మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు భర్తీచేసేలా మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతున్నాను.
6. రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు రూ.4,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. మీరు అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకున్న బకాయి మొత్తం సహా నిరుద్యోగ భృతిని నెలనెలా చెల్లించాలని కోరుతున్నాను.
7. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జీవో నంబర్ 46 రద్దు చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. కానీ అధికారంలోకి వచ్చినంక వారిని నట్టేటముంచి జీవో 46 ప్రకారమే నియామక ప్రక్రియ పూర్తిచేశారు. నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది మరో నిదర్శనం. ప్రభుత్వం వెంటనే జీవో 46 ద్వారా ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతున్నాను. నిరుద్యోగ యువతకు మీరు ఇచ్చిన వాగ్దానాలను గుర్తుచేసేందుకు, తద్వారా వారి ప్రయోజనాలను కాపాడేందుకు నేను రాసిన ఈ లేఖను సహృదయంతో అర్థం చేసుకొని వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తారని నమ్ముతున్నాను.

తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి. పక్కన మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా

లక్ష్మీపుత్రుడు కాదు లంకపుత్రుడు

- ఎమ్మెల్యే పదవికి పోచారం రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గణేశ్‌గుప్తా

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : పోచారం శ్రీనివాస్‌రెడ్డి లక్ష్మీపుత్రుడు కాదని, లంకపుత్రుడుగా మారారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఏ జీవన్‌రెడ్డి ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్‌లో పోచారం పదవులన్నీ అనుభవించి, పార్టీని వదిలి వెళ్లారని, పోచారం ఆయన కుటుంబసభ్యుల గురించి ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటిది ఇప్పుడు సిగ్గు లేకుండా కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని జీవన్ మండిపడ్డారు. పోచారం తన నియోజకవర్గానికి రూ.7500 కోట్ల నిధులు తీసుకెళ్లారని, రాష్ట్రంలోనే అత్యధిక డబుల్ బెడ్ రూం ఇండ్లను కేసీఆర్ బాన్సువాడకు కేటాయించారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే గణేశ్ బిగాలతో కలిసి ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదన్న పోచారం, ఇపుడు పార్టీకి ఎలా ద్రోహం చేశారని ప్రశ్నించారు. రైతుల కోసం పోచారం కాంగ్రెస్‌లోకి వెళ్లలేదని, ఇసుక దందా బందయిందని, క్రషర్‌కోసం వెళ్లారని విమర్శించారు. దమ్ముంటే పోచారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్ విసిరారు. పార్టీ మారిన వాళ్లను రాళ్లతో కొట్టాలని రేవంత్‌రెడ్డి గతంలో పిలుపునిచ్చారని, ఆ మాటలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. బాన్సువాడలో ఉప ఎన్నిక తథ్యమని, ఎప్పుడు ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ విజయం ఖాయమని జీవన్‌రెడ్డి స్పష్టంచేశారు. చంద్రబాబు, కేసీఆర్‌లకు ద్రోహం చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రేపు రేవంత్‌రెడ్డిని కూడా మోసం చేస్తారని చెప్పారు.

పోచారంను దేవుడు కూడా క్షమించడు

మాజీ ఎమ్మెల్యే గణేశ్ బిగాల మాట్లాడుతూ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గతంలో బీఆర్ఎస్‌లో చేరిన సమయంలో తల్లిపాలు తాగేవాళ్లు బీఆర్ఎస్‌లో ఉంటారు, డబ్బాపాలు తాగే వాళ్లు టీడీపీలో ఉంటారన్నారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో ఆయనకు సీనియారిటీ కన్నా వయసు దృష్ట్యా పదవులు లభించాయని, పార్టీలో అత్యధిక లబ్ధిపొందిన కే కేశవరావు, కడియం శ్రీహరి, తాజాగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిలాంటివారే బీఆర్ఎస్‌ను వదిలి వెళ్లారని చెప్పారు. 'పచ్చగా ఉన్న దగ్గర ఉండాలి, వెచ్చగా ఉన్న దగ్గర పడుకోవాలి' అనేది పోచారం విధానంగా ఉన్నట్టుందని విమర్శించారు. పోచారం చేసిన పనికి ఆయనను దేవుడు కూడా క్షమించడని, ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లో నాయకులకు కొదువ లేదని, నలుగురు పోయినంత మాత్రాన వచ్చిన నష్టమేమీ లేదని, మళ్లీ అధికారంలోకి వచ్చేది తమ పార్టీయేనని ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్ఎస్‌వీ నేతలు స్వామి, రఘురాం పాల్గొన్నారు.

629 మందికి పోలీస్ సేవా పతకాలు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర హోంశాఖ పోలీసులకు వివిధ సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జితేందర్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. పోలీసుశాఖలోని అన్ని విభాగాల్లో శౌర్య పతకం నుంచి సేవా పతకం వరకు మొత్తం 629 మందికి ఈ సేవా పతకాలను ప్రకటించారు. అగ్నిమాపకశాఖలో 18 మందిని ఎంపిక చేశారు. ఈ పతకాలను ఆగస్టు 15న ఇవ్వనున్నట్టు సమాచారం. పోలీసుశాఖలో శౌర్యపతకానికి ఏడుగురిని, మహోన్నత సేవా పతకానికి 15, ఉత్తమ సేవా పతకానికి 93, కఠిన సేవా పతకానికి 54, సేవా పతకానికి 460 మందిని ఎంపిక చేశారు. ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రభుత్వం ఈ పతకాలను ప్రకటించింది.

సీఐ అశోక్

శౌర్య పతకం అందుకోనున్న పోలీస్ అధికారులు

పేరు	హోదా	ప్రాంతం
బీ అశోక్	ఇన్‌స్పెక్టర్ డీసీఆర్బీ	దుమ్ముగూడెం
యూ వెంకటయ్య	ఏఆర్ ఎస్ఐ	భద్రాద్రికొత్తగూడెం
పెండెం శ్రీనివాస్	ఇన్‌స్పెక్టర్ ఎస్ఐబీ	ఇంటెలిజెన్స్
జీ అశోక్ కానిస్టేబుల్	సీఐ సెల్	ఇంటెలిజెన్స్
జీ సాయిలూ	టీఎస్ఎస్పీ కానిస్టేబుల్	గ్రేహౌండ్స్
పీ సంపత్‌కుమార్	జూనియర్ కమాండో	పీసీ, గ్రేహౌండ్స్
ఎస్ సతీశ్	జూనియర్ కమాండో	పీసీ, గ్రేహౌండ్స్

కొత్త చట్టాలపై లాయర్లకు శిక్షణ

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త చట్టాలపై న్యాయవాదులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ కోరారు. న్యాయవాదుల కోసం రాష్ట్ర పోలీస్ అకాడమీలో రెండ్రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోలీస్ అకాడమీ, బార్ కౌన్సిల్‌ను ప్రశంసించారు. న్యాయవాదులు సోదరభావంతో మెలగాలని, విధానపరమైన బాధ్యతతో వ్యవహరించాలని జస్టిస్ శ్యాం కోశీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ ఎం రాజేందర్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఏడీజీ అభిలాష బిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

వేములవాడలో ఇసుక మాఫియా!

- అనుమతుల పేరిట అక్రమ దందా
- మైనింగ్ అధికారులపై దాడికి యత్నం

వేములవాడ, జూన్ 22: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. అనుమతుల పేరిట మూలవాగు నుంచి నిత్యం వందల ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణీత సమయం దాటినా రవాణా చేస్తున్నది. ట్రాక్టర్ల డ్రైవర్ల ర్యాష్ డ్రైవింగ్‌తో పట్టణ జనం బెంబేలెత్తుతున్నది. తనిఖీలకు వచ్చిన అధికారులపై దాడులకు తెగబడుతున్నది. ఇదే తరహాలో శనివారం మైనింగ్ అధికారిపై స్థానిక భీమేశ్వర గార్డెన్స్ వద్ద అందరూ చూస్తుండగానే ట్రాక్టర్ డ్రైవర్ దాడి చేసిన ఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది.

ఒకే ట్రిప్పునకు అనుమతి..

వేములవాడ మూల వాగు నుంచి ఇసుకను తరలించేందుకు ప్రభుత్వ, స్థానిక అవసరాలకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. అయితే పర్యవేక్షణ కొరవడటంతో అక్రమ దందాకు తెరలేపారు. కేవలం రూ.300 డీడీ చెల్లించి ఒక ట్రిప్పును మాత్రం తీసుకెళ్లాల్సి ఉండగా ఒకే దానిపై మూడు, నాలుగు ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలువురు ఫిర్యాదు చేయడంతో శనివారం సిరిసిల్ల జిల్లా మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, ఆర్ఐ సైదులు తనిఖీ నిర్వహించారు. కోరుట్ల వైపు వేగంగా వెళ్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను భీమేశ్వర గార్డెన్ వద్ద ఆపేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ వాహనం దిగి అధికారులతో దురుసుగా ప్రవర్తించాడు. తిట్ల దండకం అందుకున్నాడు. రేపు మళ్లీ ఎట్లా తనిఖీలకు వస్తారో చూస్తామంటూ బెదిరిస్తూ గల్లాపట్టుకొని దాడికి యత్నించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

రైతు బంద్‌కు సాకులు

- క్యాబినెట్ సబ్ కమిటీ పేరుతో కాలయాపన
- ఐదు ఎకరాలలోపు రైతులు 92% మంది
- వారికి 2 లక్షల రుణమిచ్చే అవకాశమే లేదు
- మరి ఎవరికి మాఫీనో ప్రభుత్వం చెప్పాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రినిరంజన్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రైతుబంధు డబ్బులు ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుంటిసాకులు చెప్తున్నదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఈ పాటికే రైతుబంధు పడాల్సిందని, కానీ ఇప్పుడు క్యాబినెట్ సబ్‌కమిటీ పేరుతో కాలయాపన చేయాలని, చివరికి రైతుబంధు ఎగ్గొట్టాలని చూస్తున్నారని విమర్శించారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర రైతాంగం గొంతు కోయడమే కాంగ్రెస్ ప్రభుత్వం పని అన్నట్టుగా ఉన్నదని, ఎన్నికల ముందు ప్రజలను నమ్మించి మోసం చేశారని ధ్వజమెత్తారు. ఆకలి అవుతుంది అంటే ఆరు నెలలు ఆగండి అన్నట్టు ఈ ప్రభుత్వ తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. రైతాంగాన్ని నట్టేట ముంచే పని చేస్తున్నారని, ఈ పాటికే రైతుబంధు పడాల్సిందని, రేవంత్ ప్రభుత్వం వచ్చి మూడు సీజన్లు అవుతున్నా, రైతు భరోసా కాదు కదా రైతుబంధు కూడా సరిగా ఇవ్వలేదని మండిపడ్డారు. రైతు భరోసాపై మంత్రి వర్గ ఉపసంఘం వేసి జూలై 15 దాకా డెడ్‌లైన్ పెట్టారని, అప్పటికే నాట్లు వేసే పని పూర్తవుతుందని, సీజన్ అయిపోయాక రైతు భరోసా ఇస్తారా? రైతు భరోసాకు అర్హులెవరో ఇప్పటిదాకా ఎందుకు తేల్చలేదు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 2,603 వ్యవసాయ క్లస్టర్లు.. ప్రతి క్లస్టర్‌లో 5 వేల ఎకరాలు ఉంటాయని, ఇందులో ఎన్ని ఎకరాలు, ఏ పంట సాగు చేస్తున్నారనే విషయాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని.. అయినా ఉపసంఘం అనేది కుంటిసాకు మాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిమందికే రైతు భరోసా ఇచ్చే కుట్రకు తెర లేపారని ఆరోపించారు. వ్యవసాయరంగానికి కేసీఆర్ హయంలో రూ.4.50 లక్షల కోట్లు వెచ్చించామని వెల్లడించారు. దాంతో రైతాంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని తెలిపారు. 5 ఎకరాల్లోపు రైతులు 92.50 శాతం ఉన్నారని, 25 ఎకరాలకు పైబడి ఉన్న రైతులు 6,488 మందికి మించి లేరని వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఏడాదిలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని ఇదే రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారని, కానీ ఇప్పుడు రెండు పంటలకు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. సీఎం నియోజకవర్గం కొడంగల్‌లోనూ నకిలీ విత్తనాల దందా వెలుగులోకి వచ్చిందని తెలిపారు.

రుణమాఫీ ఎవరెవరికి?

'కేసీఆర్ హయంలో రుణమాఫీ కాకుండా మిగిలింది రూ.4 వేల కోట్లు మాత్రమే. ఐదెకరాల భూమి ఉన్న రైతులు 92 శాతం. వీరికి రూ.లక్షకు మించి పంట రుణం ఏ బ్యాంకూ ఇవ్వదు. రూ.2 లక్షల పంట రుణాలు ఎంత మందికి ఉన్నాయో కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించాలి' అని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మరి ప్రభుత్వం ఎవరికి రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. రుణమాఫీ జరిగినట్టే కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, ఏడు నెలలు ఆలస్యం అయినందుకు ఒక్క మీడియా అయినా ప్రశ్నించిందా? అని నిలదీశారు. ఒక సెక్షన్ మీడియా పిల్ల పుట్టక ముందే కుల్లకుడుతున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ రైతాంగం ఉసురుపోసుకుంటున్నా మేధావులు నోరెత్తడం లేదని మండిపడ్డారు.

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా: ఎర్రబెల్లి

తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయటమే తన లక్ష్యమని స్పష్టంచేశారు. తాను పార్టీ మారుతున్నాననే ప్రచారం నేపథ్యంలో వివరణ ఇచ్చారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న గౌతమ్‌కృష్ణ తేజ

జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థికి డాక్టరేట్

- తెలంగాణ వర్సిటీ అందజేత
- సముద్రగర్భ పరిస్థితులు, ప్రకృతి విపత్తులపై గౌతమ్‌కృష్ణ తేజ పరిశోధనలు

కరీంనగర్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో పరిశోధన విద్యార్థి గుండా గౌతమ్‌కృష్ణ తేజకు తెలంగాణ విశ్వవిద్యాలయం డాక్టరేట్ (పీహెచ్‌డీ) ప్రదానం చేసింది. డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, తెలంగాణ విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయన ఈ పరిశోధన చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్‌కు చెందిన గౌతమ్‌కృష్ణ తేజ డాక్టర్ ఆర్ సుధాకర్‌గౌడ్ పర్యవేక్షణలో 'జియో డైనమిక్స్ ఆఫ్ బేరిన్ ఐలాండ్ వాల్కనిజం, ఇన్సైడ్స్ ఫ్రోమ్ జియో స్పెషల్ టెక్నాలజీ' అంశంలో పరిశోధన చేశారు. ఈ పరిశోధనలకుగానూ ఉస్మానియా విశ్వవిద్యాలయ భూగోళశాస్త్ర ప్రొఫెసర్ నగేశ్ ఆధ్వర్యంలో ఇటీవల (ఈ నెల 18న) నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పట్టాను అందజేశారు. డాక్టరేట్ అందుకున్న గౌతమ్‌కృష్ణ తేజను శనివారం తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఆరతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ అరుణ, ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకుడు అత్తర్ అలీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ హెడ్ డాక్టర్ కవితా తురన్, అధ్యాపకులు డాక్టర్ సబిత, డాక్టర్ ప్రతిజ్ఞ, డాక్టర్ నారాయణ, వివిధ డిపార్ట్‌మెంట్ల అధ్యాపకులు పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ దొంగల ఉచ్చులో ఐపీఎస్ కుటుంబాలు

- ఒకరికి కోటికిపైగా.. కొందరికి లక్షల్లో లూటీ
- స్టాక్ మార్కెట్‌లో ప్రాఫిట్స్ పేరిట మోసం
- ఆర్మీ కుటుంబానికి న్యూడ్ కాల్స్‌తో గాలం

> తెలంగాణ ప్రభుత్వంలో వారు సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్లు. ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. పొద్దున నిద్